పుట్టపర్తి సమాధి రోడ్డులో విద్యుత్ స్తంభానికి చుట్టిన వైర్లు



ఇరుకు వీధులతో.. బెరుకు..!

అగ్నిమాపక వాహనం వెళ్లేందుకు వీలులేని వైనం
హైదరాబాద్ ఘటనతోనైనా మేలుకునేరా..?



ప్రమాదకరంగా భవనాలు.. కింద వాణిజ్యం, పైన నివాసాలు

హిందూపురం/పుట్టపర్తిరూరల్, మే20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. దీంతో ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తితో పాటు హిందూపురం, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో భద్రత ఎలా ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రధాన రహదారులు మినహా ఎక్కడా అగ్నిమాపక వాహనం వెళ్లేందుకు ఏమాత్రం అవకాశం లేనంత చిన్నరోడ్లు ఉన్నాయి. పుట్టపర్తిలో ఆటోలు వెళ్లేందుకు కూడా రోడ్లు లేకపోయినా.. ఏడంతస్తులపైగా ఆకాశహర్మ్యాలు వెలిశాయి. అధికారుల అవినీతి, పట్టణవాసుల స్వార్థంతో వీధులన్నీ కుంచించుకుపోయాయి. ఏవైనా అనుకోని అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఆస్తి, ప్రాణనష్టాలు ఊహకు కూడా అందవు. ఇవి చాలవన్నట్లు ఇరుకు రోడ్లలో ఏ విద్యుత్ స్తంభం చూసినా చిక్కుముళ్లతో కనిపిస్తున్నాయి. ఏమాత్రం షార్ట్ సర్క్యూట్ జరిగినా ప్రమాదాన్ని ఊహించడం కూడా కష్టమే.


పుట్టపర్తి

రెండు నెలల క్రితం హిందూపురం పట్టణం ముక్కడిపేటలోని ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు తగలబడుతున్నా చూస్తూ మిన్నకుండిపోయారు. ఆ వీధిలోకి అగ్నిమాపక యంత్రం రావడానికి ఆస్కారం లేదు. ఆటో కూడా వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటుంది.

● గత ఏడాది చెక్కటకార్ వీధిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడ్డాయి. చుట్టుపక్కల వారు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. కానీ అక్కడికి చేరుకునేందుకు ఆస్కారం లేదు. దీంతో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి.

● ఆరునెలల క్రితం డీఎల్ రోడ్డు సమీపంలో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి అర్త్ కావడంతో పై అంతస్థులో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక యంత్రం రావడానికి వీలులేకపోవడంతో స్థానికులే మంటలను ఆర్పారు.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. అర్ధరాత్రి సమయంలో ఇలాంటి ప్రాంతాల్లో జరగరానిదేదైనా జరిగితే బాధ్యులు ఎవరనేది ప్రశ్నార్థకం. హిందూపురం పట్టణంలో ఇరుకు వీధులు చాలా ఉన్నాయి. అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనివల్ల చిరు వ్యాపారులు మెయిన్‌బజార్‌లో బాడుగలు కట్టుకోలేక సమీపంలో ఉన్న వీధుల్లో వ్యాపారం చేస్తున్నారు. చాలా వీధుల్లో కింద దుకాణాలు, పైన నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. సెట్‌బ్యాక్‌లు, అగ్నిమాపక ఏర్పాట్లు లేవు. కొన్ని భవనాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు అలంకారప్రాయంగా ఉంటున్నాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు తరువాత మిన్నకుండిపోతున్నారు. హిందూపురం పట్టణంలోని ముక్కడిపేట, జవీస్ట్రీట్, మెయిన్‌బజార్‌కు ఉన్న వీధులు, డీఎల్ రోడ్డు, చెక్కటకార్ వీధి, పాత హస్నాబాద్, సత్యనారాయణపేట తదితర ప్రాంతాల్లో ఇరుకు వీధులు ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పుడు మున్సిపల్ నిబంధనలు పట్టించుకోకుండా, రహదారులకు స్థలం వదలకుండా ఇళ్లు కట్టుకున్నారు. ఇలాంటి చిన్న వీధులు 80 నుంచి 100 దాకా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వీధుల్లోని భవనాల్లో ప్లాస్టిక్, ఇతరాత్ర సామగ్రి నిలువచేస్తున్నారు. అక్కడ ఏదైనా జరిగితే అంతే. హైదరాబాద్‌లో జరిగిన ఘటనతోనైనా అధికారులు, ప్రజలు మేలుకునేరా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

హిందూపురంలో ఇరుకుగా ఉన్న వీధుల్లో కింద వాణిజ్య సముదాయాలు, పైన నివాసాలు



ఇరుకు వీధుల్లోకి వెళ్లలేం

హిందూపురం పట్టణంలో కొన్ని వీధుల్లో అగ్నిమాపక యంత్రం వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. ఇరుకు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. కనీసం 30 అడుగుల రోడ్డు ఉంటేనే అగ్నిమాపక వాహనం రావడానికి వీలుంటుంది. తప్పనిసరిగా రోడ్డు వెడల్పుగా ఉండాలి. భవంతులైతే అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి.



- ప్రభాకర్,
అగ్నిమాపక శాఖ అధికారి, హిందూపురం

రక్షణ చర్యలు పాటించాలి

జిల్లాలో అగ్నిమాపక అనుమతుల్లేని భవనాలే ఎక్కువ. దీంతో ఏవైనా ప్రమాదాలు చోటుచేసుకుంటే ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రతిఒక్కరూ అగ్ని ప్రమాద నివారణ చర్య లు పాటించాలి. నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించాలి. బహుళ అంతస్థుల్లో రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో మూసివేసే సమయాల్లో విద్యుత్‌ను పూర్తిగా నిలిపివేయాలి.

-హేమంత్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి, పుట్టపర్తి

బాధ్యతగా పని చేయండి

● ఎంపీడీఓలకు కలెక్టర్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో ఎంపీడీఓలు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమపథకాలు అమలు, అభివృద్ధి పనులపై జిల్లాలోని ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమపథకాల అమలులో ఎంపీడీఓలు కీలక పాత్ర పోషించాలన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేయడంతో ఎంపీడీఓలు కీలకంగా పనిచేయాలన్నారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి చెత్త సేకరణను పంచాయతీల్లో వందశాతం అమలు చేయాలన్నారు. జిల్లాలోని లేపాక్షి, రొళ్ల, అగళి నల్లమాడ, తనకల్లు, కొత్తచెరువు మండలాల్లో ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం అనుకున్న స్థాయిలో సాగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మండలాలపై ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలు సాధించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఎంపీడీఓలపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీఓ సమత, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జునప్ప, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు



ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లన్నపల్లి వంక

గోరంట్ల, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం కురిసిన వర్షానికి సరిహద్దు ప్రాంతం నుంచి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గోరంట్లలో ఆదివారం 96.2 మి.మీ. భారీ వర్షం కురిసింది. మంగళవారం గోరంట్లలో పెద్దగా వర్షం కురవకపోయినా, ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, చిలమత్తూరు మండలాల్లో భారీ వానలు పడ్డాయి. దీంతో వెంకటరమణపల్లి పంచాయతీ, నల్లన్నపల్లి వద్దగల వంక ఉధృతంగా ప్రవహించాయి. ఈ వంక ద్వారా పులేరు చెరువుకు నీరు చేరుతోంది.

బదిలీల హడావుడి..!

సిఫార్సు లేఖల కోసం నాయకుల వద్దకు..

● ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ● అన్నిశాఖల్లో మార్పులకు శ్రీకారం



హిందూపురం, మే 20(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీల సందడి నెలకొంది. అన్నిశాఖల్లోని ఉద్యోగులకు వచ్చేనెల 2లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది ఈక్రమంలోనే కలెక్టర్లకు కూడా ఆదేశాలు జారీచేశారు. దీంతో ఉద్యోగులు కావాల్సిన చోటుకు బదిలీ అయ్యేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పైరవీలు ప్రారంభం

బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఉద్యోగులు తమకు కావాల్సిన స్థానాల కోసం వెంపర్లాడుతున్నారు. కొన్నిశాఖల్లోని అధికారులు ఆదాయవనరులు ఎక్కువగా ఉన్న కుర్చీల కోసం పోటీపడుతున్నారు. దీంతో బదిలీల కోసం నాయకులవద్ద పైరవీలు ప్రారంభించారు. సమయం తక్కువగా ఉండటంతో తమకు కావాల్సిన చోటు దక్కకుండా పోతుందేమోనన్న ఆందోళనతో ఉదయం లేవగానే ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్తున్నారు.

అన్నిశాఖల్లోనూ..

గత ఏడాది నూతన ప్రభుత్వం కొలువుదీరగానే అత్యవసర ఉద్యోగులను మాత్రమే బదిలీ చేసింది. విద్యా, వైద్యం, ఇరిగేషన్ లాంటి శాఖల్లో బదిలీలు జరగలేదు. ప్రస్తుతం ఆశాఖల్లో భారీగా ఉద్యోగుల బదిలీలు కొనసాగనున్నాయి. అన్నిశాఖల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బదిలీలు చేసేవిధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 2025 మే 31నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశాలిచ్చారు. ఐదేళ్లు కానివారు కూడా బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే వారి దరఖాస్తు పరిగణలోకి తీసుకుని పరిపాలన సౌలభ్యం కోసం మార్పులు చేసుకునే అవకాశం కల్పించారు.

వీరికి అధిక ప్రాధాన్యం

అనారోగ్యంతో బాధపడే వారికి ప్రస్తుత బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులు, విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగ పిల్లలు ఉండి వైద్య వసతి కలిగిన ప్రదేశాలకు వెళ్లాలనుకునేవారికి ప్రాధాన్యం ఉంటుంది. రెండేళ్లకంటే ఎక్కువ కాలం పనిచేసే ఉద్యోగులు 40శాతంకి పైగా అంగవైకల్యం కలిగినవారు, కేన్సర్, గుండె సంబంధిత, న్యూరోసర్జరీ, కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ తదితర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేవారికి, కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు. దివ్యాంగ ఉద్యోగులు కోరుకుంటే తప్ప వారిని బదిలీ చేయకూడదని ప్రభుత్వం మార్గదర్శకాలు స్పష్టంచేసింది. భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగులైతే ఇద్దరికి ఒకేచోట ఇచ్చేందుకు వీలుకాకపోతే పక్క పక్క ప్రాంతాల్లో సర్దుబాటు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ప్రమోషన్ పొందిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలని, ఆ పోస్టు ఇతర ప్రాంతాల్లో లేకపోతే అదేస్థానంలో కొనసాగించవచ్చని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది.

ఉమ్మడి జిల్లా యూనిట్‌గా..

ఉమ్మడిజిల్లా యూనిట్‌గా ఆయాశాఖల్లో ఉద్యోగుల బదిలీలు జరుగనున్నాయి. జిల్లా, జోనల్, మల్టీ జోనల్ క్యాడర్ ఉద్యోగ బదిలీలు ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకుని చేపడతారు. ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేకుండా సకాలంలో సంబంధితశాఖలు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బదిలీల్లో ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే సంబంధిత శాఖల అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయి ఉద్యోగాల్లో పని చేస్తున్నవారు ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు టర్మ్‌లుగా తొమ్మిదేళ్ల సర్వీసుగా ఒకే చోట పూర్తి చేసి ఉంటే తప్పనిసరిగా బదిలీ చేస్తారు. తాలూకా, జిల్లాస్థాయి గుర్తింపు పొందిన ఉద్యోగుల అసోసియేషన్ ఆఫీసర్ బేరర్స్ జాబితాలో కలెక్టర్ ద్వారా ఆయాశాఖల అధికారులు పంపాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది. వచ్చేనెల 3నుంచి బదిలీలపై నిషేధం అమలులోకి వస్తుందని ఆలోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.


దేవుడికే శఠగోపం!

26.37 ఎకరాల లక్ష్మీనరసింహస్వామి భూమి ఆక్రమణ

సాగు ముసుగులో 1బీ, పట్టాలు సృష్టించుకున్న వైనం
15 సంవత్సరాల తర్వాత వెలుగులోకి భూబాగోతం
చిన్నూరు గ్రామంలో వైసీపీ నాయకుల దోపిడీ


జ్వాలాపురం లక్ష్మీనరసింహస్వామి భూమి

ధర్మవరం, మే 20(ఆంధ్రజ్యోతి): రూ.కోట్లు విలువ చేసే జ్వాలా లక్ష్మీనరసింహస్వామి మఠానికి చెందిన భూములను వైసీపీ నాయకులు (అప్పట్లో కాంగ్రెస్) అప్పనంగా కొట్టేశారు. దేవదాయ శాఖ అధికారుల కన్నుగప్పి 2010 ప్రాంతంలో గుట్టుగా తమ పేర్లపై పట్టా పాసు పుస్తకాలు, 1బీ అండంగళ్ సృష్టించుకున్నారు. ఆ నోటా ఈ నోటా పడి 15 సంవత్సరాల తర్వాత వెలుగు చూసిన ఈ భూ బాగోతానికి మున్సిపాలిటీలోని చిన్నూరు గ్రామం వేదికైంది. ఎకరా రూ.20లక్షలకు పైగా విలువ చేసే 26.37 ఎకరాలను వైసీపీకి చెందిన దండు ఓబులేసు, దండు వెంకటేశులు, దండు వన్నూరమ్మ, నీరుగంటి వన్నూరమ్మ, కొట్టం వెంకటరాముడు, ఉల్లికంటి గోవిందరెడ్డి, ఉల్లికంటి మధుభూషణ్‌రెడ్డి, ఉల్లికంటి చంద్రకళ, రామలింగారెడ్డిలు తమ పేరుపై 1బీ అడంగళ్, పాసుపుస్తకాలు సృష్టించుకున్నారు. ఈ భూమిని బ్యాంకులో తనఖా పెట్టి రుణాలు కూడా పొందారు. వీరికి దేవదాయ శాఖ అధికారులు కూడా లోపాయికారిగా సహకరించారనే ఆరోపణలు వినవస్తున్నాయి. రూ.ఐదు కోట్లకు పైగా విలువైన జ్వాలాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమైనా అధికారులు కానీ పాలకులు కానీ పట్టించుకోకపోవడం వెనక భారీ ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు గ్రామానికి చెందిన కొందరు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.


డైక్లాట్‌లో జ్వాలాపురం లక్ష్మీనరసింహస్వామికి చెందిన భూమిగా చూపిస్తున్న దృశ్యం

ఎలా కాజేశారంటే..

మున్సిపల్ పరిధిలోని చిన్నూరు గ్రామంలో సర్వే నెంబరు 822లో జ్వాలాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన 26.37 ఎకరాలు భూమి ఉంది. దాదాపు 30 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు, ఆలయ అర్చకులు, ధర్మకర్తలతో చర్చించి సాగు చేసుకునేందుకు అనుమతి పొందారు. కాలక్రమంలో భూములను సొంతం చేసుకోవాలని పన్నాగం పన్నారు. స్థానికంగా ఉండే ప్రధాన నాయకుడి సహాయంతో రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. దీంతో 2010-11 మధ్య కాలంలో 1బీ, పాసుపుస్తకాలు పొందారు. అప్పటి నుంచి ఆ సాగుదారులు ఆ భూమిపై పెత్తనం చెలాయించడం మొదలుపెట్టారు.

పక్క భూముల రైతులకు ఇక్కట్లు

సాధారణంగా ప్రభుత్వ భూములు, ఎండోమెంట్ భూముల పక్కన పూర్వం పట్టా భూములు కలిగిన రైతులకు దారి వదలాలన్న నిబంధనలు రెవెన్యూ చట్టంలో రూపొందించారు. అయితే సాగుదారులు ఈ చట్టాన్ని కాలరాసి రహదారి దున్నేసి తమ భూములోకి కలుపుకున్నారు. దీంతో పక్కభూముల రైతులకు దారి సమస్య ఏర్పడింది. దారి వదలాలని అభ్యర్థించిన పట్టించుకోకుండా భౌతికదాడులకు దిగుతున్నట్లు పక్కపొలాల రైతులు వాపోతున్నారు. తీవ్ర వ్యతిరేకత రావడంతో మళ్లీ దారి వదిలేశారని రైతులు పేర్కొన్నారు. స్వామివారికి చెందిన భూములను తమ పేరుపై మార్చుకున్నారన్న విషయం ఇటీవల తెలుసుకున్న కొందరు గ్రామస్తులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఈసీ కోరారు. రికార్డుల్లో ఇప్పటికీ ఆ భూమి జ్వాలాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందినదిగానే ఉంది.

నిద్రావస్థలో ఎండోమెంట్ అధికారులు

ధర్మవరం నియోజకవర్గంలో దేవదాయశాఖకు వేలాది ఎకరాలు భూములున్నాయి. కొందరు ఎండోమెంట్ అధికారుల అలసత్వం, లోపాయికారి ఒప్పందాల కారణంగా ఎక్కడ భూములు అక్కడ అన్యాక్రాంతమవుతూనే ఉన్నాయి. రూ.కోట్లు విలువ చేసే భూములన్నీ అధికారం అండతో కొందరు నాయకులు ఇష్టారాజ్యంగా దోచేస్తున్నా ప్రశ్నించే నాథుడే లేడు. ఇందుకు చిన్నూరు గ్రామంలోని జ్వాలాపురం లక్ష్మీనరసింహస్వామికి చెందిన 26 ఎకరాల భూమి అన్యాక్రాంతం కావడమే నిదర్శనం.

కోర్టు ఆదేశాల మేరకు చర్యలు

జ్వాలాపురం లక్ష్మీనరసింహస్వామి భూమి వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. ఇదివరకే కౌంటర్ దాఖలు చేశాం. కోర్టు నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-నాగరత్నమ్మ
ఎండోమెంట్ అధికారి

వానలు ఫుల్..!

ఈ ఏడాది అధిక వర్షాలు
30నే నైరుతి రుతుపవనాల రాక


6

ఏపీ ఐసెట్‌లో 95% ఉత్తీర్ణత

పుట్టపర్తిరూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్-2025 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈఫలితాలను విశాఖలో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ విడుదల చేశారు.

ఐసెట్-2025కు సంబంధించి జిల్లావ్యాప్తంగా 204 మందిలో బాలురు 103, బాలికలు 101 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, 192 మంది పరీక్షలకు హాజరయ్యారు. 95శాతం ఉత్తీర్ణతతో 182 మంది క్వాలిఫై అయ్యారు. ఇందులో బాలికలు 87 మంది, బాలురు 95 ఉన్నారు.



వానలు ఫుల్..!

ఈ ఏడాది అధిక వర్షాలు

30నే నైరుతి రుతుపవనాల రాక

వాతావరణ శాఖ

బుక్కరాయసముద్రం, మే 20(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానలే వానలు. దంచికొడతాయని వాతావరణ శాఖ సూచిస్తోంది. ఉమ్మడి జిల్లాను నైరుతి రుతుపవనాలు ముందుస్తుగా తాకనున్నాయి. ప్రస్తుతం అండమాన్ నికోబార్ తీరాన్ని తాకినట్లు ప్రకటించింది. అక్కడి నుంచి కేరళకు ఈనెల 26, 27 తేదీల్లో నైరుతి రుతుపవనాలు చేరే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ముందుస్తుగానే ఉమ్మడి జిల్లాకు మే చివరి వారంలోనే నైరుతి రుతుపవనాలు తాకనున్నట్లు రేకలకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ఈ ఏడాది అత్యధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించింది. ఇప్పటికే ఆరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత వారంలో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతన్నలు సిద్ధమయ్యారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు ముందుస్తుగానే జిల్లాలోకి ప్రవేశించనుండడంతో రైతుల్లో ఖరీఫ్ సాగుపై ఆసక్తి పెరుగుతోంది. సాధారణం కంటే ఈ ఏడాది అధికంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడు నారాయణస్వామి తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల రైతులు లోతు దుక్కులు, పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సకాలంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపినట్లు శాస్త్రవేత్త నారాయణ స్వామి చెప్పారు. ఇది ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాతలకు పండగ లాంటి సమాచారం.

రానున్న మూడు రోజులు వర్షాలు

ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజులు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ప్రస్తుతం ఆరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో వర్షాలు కురుస్తాయన్నారు. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే అవకాశం ఉందన్నారు. 12-13 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

వేసవి దుక్కులు చేసుకోండి

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా పలు చోట్ల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భూమిలో ఉన్న తేమను వినియోగించుకుని వేసవి దుక్కులు చేసుకోవాలని శాస్త్రవేత్త నారాయణ స్వామి తెలిపారు. దుక్కులు చేసుకోవడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. రాబోవు సీజన్‌లో కలుపు, తెగులు, వ్యాధుల ఉధృతి తగ్గే అవకాశం ఉందన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసుకునే పంటకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరిసాగు చేసే, కోత కోసిన రైతులు ప్రస్తుతం ఉన్న తేమను వినియోగించుకుని, పచ్చిరొట్టె ఎరువులను వేసుకోవాలి. పచ్చిరొట్టె పైర్లను సాగు చేయడానికి వర్షాకాలం ఎంతో అనువైనదన్నారు. రైతులు తొలకరి వర్షాలను వినియోగించుకుని పచ్చిరొట్టె పైర్లు వేసుకోవాలన్నారు. తేమను వినియోగించుకుని వేసవి దుక్కులు చేసుకోవాలని ఆయన సూచించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

లక్ష్మీనారసింహుడికి ఘనంగా పూజలు

ఆమిద్యాలకు పయనమైన ఉత్సవ విగ్రహాలు



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఉరవకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈనెల 9న ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. 12రోజులపాటు ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆమిద్యాలకు తీసుకెళ్లారు. ఆమిద్యాలలోని పెన్నోబులేశుడి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ఉంచారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమేష్‌బాబు, అర్చకులు ద్వారకనాథాచార్యులు, సిబ్బంది దీపక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు హుండీలోకి వేసిన సొమ్ము, కానుకలను మంగళవారం లెక్కించారు. బ్రహ్మోత్సవాల పర్యవేక్షణ అధికారి పాండు రంగారెడ్డి, దేవదాయ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి పర్యవేక్షణలో హుండీలను తెరచి, లెక్కించారు. మొత్తం రూ.15.85 లక్షల హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో రమేష్‌బాబు తెలిపారు. అన్నదాన హుండీ ద్వారా 8,212 వచ్చిందన్నారు.

ఎన్నాళ్లీ నిర్లక్ష్యం

సొంత భవనంలేని జలవనరుల శాఖ

గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు బుట్టదాఖలు

హెచ్చెల్సీ స్థలాన్ని వైసీపీకి అప్పగించిన అధికారులు

అభివృద్ధి పనులు జరుగుతున్న వేళ పలు పోస్టులు ఖాళీ

ఈ ప్రభుత్వంలోనైనా జలవనరుల శాఖపై నిర్లక్ష్యం వీడేనా..?





ఇరుకు గదిలోనే హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయం, హెచ్చెల్సీ స్థలంలో నిర్మాణం పూర్తయిన వైసీపీ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, మే 20(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖకు సొంత కార్యాలయ భవన నిర్మాణం కలగానే మిగిలింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో జలవనరుల శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ప్రధానంగా హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్ట్‌లను గాలికొదిలేశారు. పైగా వైసీపీ కార్యాలయ నిర్మాణం కోసం హెచ్చెల్సీకి సంబంధించిన రెండు ఎకరాలు ఆక్రమించారు. నగరంలోని తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యా లయాన్ని 2021లో ఉన్నఫలంగా ఖాళీ చేయించారు. గత మూడెన్నరేళ్లుగా మూడు గదుల్లో కార్యాలయం నిర్వహిస్తున్నారు. వైసీపీ పాలనలో జలవనరుల శాఖ కార్యాలయ నిర్మాణం కోసం మూడుసార్లు జిల్లా ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. గత ఏడాది నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో కార్యాలయ నిర్మాణంపై ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. గత నెలలో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. హెచ్చెల్సీలోని గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ), ధర్మవరం బ్రాంచ్ కెనాల్ (డీబీసీ) రెండు డివిజన్లకు ఇన్‌చార్జ్‌లే దిక్కయ్యారు. హెచ్చెల్సీలో కీలకంగా ఉండే లోకలైజేషన్ ఈఈ ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. అది కూడా ఖాళీ అవుతుంది. హంద్రీనీవాలో ఎస్ఈతోపాటు డివిజన్ 5, డివిజన్ 7, పెనుకొండ డివిజన్లకు ఇన్‌చార్జి ఇంజనీర్లే కొనసాగుతున్నారు. వెంటనే రెగ్యులర్ ఇంజనీర్లను నియమించి ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కీలక పోస్టులు ఖాళీ

జలవనరుల శాఖలో కీలక పోసులు ఖాళీగా ఉన్నాయి. గతనెల 30న హెచ్చెల్సీ ఎస్ఈగా ఉన్న రాజశేఖర్ రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. హెచ్చెల్సీలో సుమారు రూ.50కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో కీలకంగా ఉండే ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉండటం విమర్శలకు దారితీస్తోంది. హెచ్చెల్సీ పరిధిలోని ధర్మవరం కెనాల్ డివిజన్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ డివిజన్‌లు రెండింటికీ ఇన్‌చార్జి ఈఈలే కొనసాగుతున్నారు. హెచ్చెల్సీలో కీలకంగా ఉండే లోకలైజేషన్ డివిజన్ ఈఈ వెంకటరమణారెడ్డి కూడా ఈనెలాఖరులో ఉద్యోగవిరమణ చేయనున్నారు. హంద్రీనీవాలో ఎస్ఈ పోస్టు, డివిజన్ 5, 7, పెనుకొండ డివిజన్‌లలోనూ ఇన్‌చార్జి ఈఈలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం హంద్రీనీవాలో సుమారు రూ.1400కోట్లతో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు, లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కీలక పోస్టులలో ఇన్‌చార్జిలు కొనసాగుతుండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

మూడు ముక్కలుగా హెచ్చెల్సీ కార్యాలయం

హెచ్చెల్సీ కార్యాలయాన్ని మూడు ముక్కలు చేశారు. సుమారు 20ఎకరాలకు పైగా సొంత స్థలం ఉన్నా సొంత భవనం నిర్మించుకోలేని దుస్థితిలో హెచ్చెల్సీ శాఖ ఉంది. కొన్నేళ్ల కిందట నగరంలోని తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని బలవంతంగా ఖాళీ చేయించారు. 2021లో ఉన్న ఫలంగా అక్కడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి విస్తరణ నిర్మాణాలు చేపట్టాలని అప్పటి అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే ఒత్తిడితో ఖాళీ చేశారు. సొంత స్థలం ఉన్న హెచ్చెల్సీ కాలనీలో ఏదో ఒక చోట కార్యాలయం నిర్మించుకోవచ్చు అనుకున్నారు. అయితే హెచ్చెల్సీ కాలనీలో ఎస్ఈ కార్యాలయాన్ని ఒక చోట, డిప్యూటీ ఎస్ఈ ఒక చోట, మిగిలిన సిబ్బంది, రికార్డుల కోసం ఒక గదిని కేటాయించారు. దీంతో హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయం మూడు ముక్కలు అయ్యింది. అయితే ఇంతవరకు సొంత భవనానికి సంబంధించి నిధులు, నిబంధనలు జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆశాఖ ఉద్యోగులు వాపోతున్నారు. జలవనరుల శాఖ సీఈ కార్యాలయం నిర్మించాలని రెండెకరాల స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మించారు. మట్టి తవ్వి వదిలేశారు.



హంద్రీనీవా కార్యాలయం

హెచ్చెల్సీ స్థలంలో వైసీపీ కార్యాలయం

అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ విలువైన హెచ్చెల్సీ స్థలంలో రెండెకరాల స్థలాన్ని తమ పార్టీ కార్యాలయం కోసం తీసుకుంది. జలవనరుల శాఖ ఇంజనీర్లు నిబంధనలకు విరుద్ధంగా స్థలాన్ని ఓ పార్టీకి అప్పగించడం సాధ్యం కాదని చెప్పినా, రాష్ట్రస్థాయిలో అప్పటి వైసీపీ వీరభక్తుడిగా ఉన్న జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి ఒత్తిడితో సుమారు 2 ఎకరాల స్థలాన్ని అప్పగించారు. ఏడాదికి రూ.1000 నామమాత్రపు అద్దెతో లీజుకు తీసుకుకున్నారు. 33ఏళ్ల పాటు ఈ స్థలం వైసీపీ అద్దెకు తీసుకుంది. వైసీపీ కార్యాలయ భవనం నిర్మాణం వేగంగా పూర్తి చేశారు. అదే సమయంలో జలవనరుల శాఖ కార్యాలయం మాత్రం ప్రహరీకే పరిమితమైంది.

ప్రతిపాదనలు పంపాం



జలవనరుల శాఖ కార్యాలయం కోసం మూడేళ్ల కిందట మూడు సార్లు ప్రతిపాదనలు పంపాం. హెచ్చెల్సీ స్థలంలో ఒకటిన్నరెకరా స్థలంలో జలవనరుల శాఖ కార్యాలయం నిర్మాణం చేపట్టేందుకు రూ.14కోట్లతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. మూడుసార్లు గత ప్రభుత్వంలో సిద్ధం చేసిన ప్రతిపాదనలు జలవనరుల శాఖకు పంపించాం. ఒక్కసారి కూడా అక్కడ నుంచి ప్రతిస్పందన రాలేదు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. ఇక హెచ్చెల్సీ ఎస్ఈ స్థానంలో కొత్త అధికారిని త్వరలోనే నియమిస్తారు. ఇన్‌చార్జిలుగా పలు చోట్ల ఇంజనీర్లు కొనసాగుతున్నారు. అయితే ఎక్కడా పనులు ఆగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

-నాగరాజు,
జలవనరుల శాఖ సీఈ

గుడ్లు తేలేయాల్సిందే..!

చిన్నారుల పౌష్టికాహారంలో కక్కుర్తి

తవ్వేకొద్దీ బయటికొస్తున్న అక్రమాలు

తూతూమంత్రంగా అప్పటి ఆర్డీఓ నివేదిక

లక్షల్లో కోడిగుడ్లు స్వాహా

వైసీపీ హయాంలో యథేచ్ఛగా దోపిడీ పర్వం




కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

కళ్యాణదుర్గం, మే 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో వచ్చిన కరోనాను అడ్డుపెట్టుకుని ఐసీడీఎస్‌లో ఇష్టారాజ్యంగా అక్రమాలకు తెరలేపారు. చిన్నారులకు పంపిణీ చేయాల్సిన లక్షల కోడి గుడ్లు, పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టించి స్వాహాచేశారు. తాజాగా విచారణ చేస్తుండడంతో ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో చూసి అంగన్‌వాడీ కార్యకర్తలు గుడ్లు తేలేస్తున్నారు. అధికారుల మాట కాదనలేక వారు అడిగిన విధంగా సమాధానాలు రాసి ఇస్తున్నారు. 2020 సంవత్సరంలో కోడి గుడ్ల సరఫరాలో జరిగిన అక్రమాలు అధికారుల మెడకు చుట్టుకుంటున్నాయి. అప్పట్లో పనిచేసిన అధికారులు, ఓ ప్రజాప్రతినిధి, కాంట్రాక్టర్ కుమ్మక్కై లక్షల్లో కోడిగుడ్లను మాయం చేసేసి, ఆ సొమ్మును స్వాహా చేసినట్లు తెలుస్తోంది. అప్పట్లో కళ్యాణదుర్గం ఆర్డీవోగా పనిచేసిన నిశాంత్‌రెడ్డి కోడిగుడ్ల పంపిణీ గోల్‌మాల్‌పై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదికను అందచేశారు. కానీ ఆయన నివేదికపై కూడా విమర్శలు రావడంతో ప్రస్తుత ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రజాప్రతినిధి చెప్పినట్లే ఆర్డీఓ నివేదిక ఇచ్చారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కోడిగుడ్లపై కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ మంజులవాణి, సీనియర్ అసిస్టెంట్ షెక్షావలి ఈనెల 14న విచారణ చేపట్టారు. వారు కూడా తూతూ మంత్రంగా విచారణ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ అధికారిని కాపాడేందుకు ఇలా మొక్కుబడిగా విచారణ చేశారని తెలుస్తోంది.

వైసీపీ హయాంలో అక్రమాలకు అడ్డే లేకుండాపోయింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పంపిణీ చేసే కోడిగుడ్లనూ కక్కుర్తికి పాల్పడ్డారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై కోడిగుడ్లను పక్కదారి పట్టించి స్వాహా చేశారు. అక్రమార్కులకు అప్పటి ప్రజాప్రతినిధి, ఉన్నతాధికారి కూడా సహకారం అందించినట్లు తాజాగా వెలుగుచూస్తోంది. అక్రమాలను బయటకు రాకుండా తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది.

అప్పటి ప్రజాప్రతినిధి అండతోనే..

కరోనా ఉధృతంగా వేళ.. 2020లో కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోలేదు. కోడి గుడ్లు అరకొరగా సరఫరా చేసి, మిగతా వాటిని పక్కదారి పట్టించారని తెలుస్తోంది. ఇదంతా అప్పటి ఓ ప్రజాప్రతినిధి కనుసైగల్లోనే సాగిందన్న విమర్శలు ఉన్నాయి. ఆ ప్రజాప్రతినిధి ఎలా చెబితే అలా నడుచుకుంటూ స్వాహాకు తెరలేపారని తెలుస్తోంది. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో 31.48 లక్షల కోడిగుడ్లు సరఫరా చేశారు. వీటికి ఏ మాత్రం లెక్కలు లేవు. ఆన్‌లైన్ నమోదుకు, క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తల నమోదుకు భారీ వ్యత్యాసం ఉంది. దీంతోనే అక్రమాలు బయటపడ్డాయి. కోడిగుడ్లతోపాటు కిట్లు, బియ్యం, కందిబేడలు, నూనె తదితర సరుకులను అక్రమంగా తరలించి అమ్ముకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇలా లక్షలాది రూపాయలు అవినీతి జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. 2020 ఏప్రిల్, మే, జూన్, ఆగస్టు మాసాల్లోనే ఈ అక్రమాలు జరిగాయని విచారణ అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో తూతూ మంత్రంగా విచారణ చేసి, వారికి అనుకూలంగా నివేదికలు తయారు చేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అక్రమాలపై పునఃవిచారణ చేయడంతో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.



విచారణ అధికారులు తయారు చేసిన ఐదు ప్రశ్నలు



ఈనెల 14న విచారణకు వచ్చిన కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది (ఫైల్)

క్షేత్రస్థాయికి వెళ్లకుండా విచారణ

కోడిగుడ్ల అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సిన ఆర్జేడీ కార్యాలయ అధికారులు ఐసీడీఎస్ కార్యాలయంలోనే ముగించడంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఐదు ప్రశ్నలు వేసి, వాటికి అవును...అవును... అంటూ సమాధాన్ని రాయించుకోవడంపై విచారణ సక్రమంగా చేపట్టలేదన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి రికార్డులను పరిశీలించి వాటి ఆధారంగా వివరాలు సేకరించాల్సిన అధికారులు.. కార్యకర్తలను కంబదూరు కార్యాలయానికి పిలిపించుకుని విచారణ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిల్లల పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టించిన అధికారులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

సర్వజనాస్పత్రిలో మల్టీలెవల్ పార్కింగ్

పనులు ప్రారంభం

తీరనున్న పార్కింగ్ సమస్య

అనంతపురం టౌన్, మే20(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. పార్కింగ్ లేక ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో అత్యవసర కేసులను ఆస్పత్రిలోకి తీసుకెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైద్యుల కార్లు ఆస్పత్రి ఆవరణలో ఉంచుతుండడంతో రోగులకు అసౌకర్యంగా ఉంటోంది. ఏళ్లుగా పార్కింగ్ సమస్యతో సతమతమవుతున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆస్పత్రికి వచ్చినపుడు ఇంజనీరింగ్ అధికారులతో పార్కింగ్ విషయమై చర్చించారు. నగర పాలక సంస్థ ఇంజనీర్లు మెట్రో సిటీల్లో ఏర్పాటు చేసిన మల్టీలెవల్ పార్కింగ్ గురించి వివరించారు. ఆస్పత్రి ఆవరణలో అలాంటి పార్కింగ్ ఏర్పాటుకు అనువుగా ఉందని నగర పాలక, ఏపీఎంఐడీసీమెడికల్ ఇంజనీర్లు సంయుక్తంగా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. అందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. నిర్మాణవ్యయ బాధ్యతను నగర పాలక సంస్థకు అప్పగించారు. దీంతో మంగళవారం మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు పనులు మొదలు పెట్టారు. అండర్ గ్రౌండ్‌తోపాటు రెండు ఫ్లోర్లు ఏర్పాటు చేయనున్నారు.ఒక్కో ఫ్లోర్‌లో 12 నుంచి 13 వరకు కార్లు పార్కింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య పరిష్కారమవుతుందని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.



జిల్లా ఆస్పత్రిలో ప్రారంభమైన మల్టీలెవల్ పార్కింగ్ పనులు

పని చేసే ఐడియా లేదా?



నిస్తేజంగా పోలీస్ ఐడీ పార్టీలు

జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు

రవాణాను అరికట్టడంలోనూ విఫలం

మత్తు కోసం యువత ప్రయోగాలు



జనవరిలో మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

అనంతపురం క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాల్సిన పోలీస్ ఐడీ పార్టీ నిస్తేజంగా మారింది. దీంతో జిల్లాలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గంజాయి రవాణాను నిరోధించి, విక్రేతలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గంజాయి వాడకం పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా సాగుతోంది. గంజాయి ఎక్కడి నుంచి జిల్లాలోకి తెస్తున్నారనేది తెలిసినా, మూలాలను నియంత్రించడంలో పోలీస్ శాఖ వైఫల్యమైంది. క్రైం, ఐడీ పార్టీలు నిస్తేజంగా మారడంతోనే గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒడిశా, విశాఖ నుంచే...

జిల్లాలోకి గంజాయి ఒడిశా సరిహద్దు, విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి అధికంగా రవాణా అవుతోంది. దీని రవాణాకు 17ఏళ్ల లోపు బాలలను సైతం పంపుతున్నారు. చిన్న పిల్లలు కదా పోలీసులు అనుమానించరనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నారు. కానీ వారు కూడా పలు సందర్భాల్లో పట్టుబడ్డారు. మహిళలు కొందరు నేరుగా గంజాయిని తెప్పించి విక్రయిస్తున్నారు. అక్కడ కిలో గంజాయి రూ.వెయ్యి నుంచి రూ.1500లకు వెచ్చించి కొనుగోలు చేసి, రైలులో తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. చిన్న ప్యాకెట్ సైతం రూ.300ల నుంచి రూ.500లకు విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు. 20 ఏళ్ల యువకుల నుంచి 50ఏళ్ల వ్యక్తుల వరకు ఈ మత్తులో జోగుతున్నట్లు సమాచారం.

నిస్తేజంగా ఐడీ పార్టీలు...

జిల్లాలో చివరిసారిగా నాలుగు నెలల కిందట ఏడుగురు సభ్యులు గల గంజాయి ముఠాను అరెస్ట్ చేశారు. తర్వాత నగరంలోని ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా గంజాయి పట్టుబడలేదు. ఒక్కో పోలీస్‌స్టేషన్‌లో కనీసం ఇద్దరు ఐడీ సిబ్బంది పనిచేస్తున్నారు. నేరాలు చేసే వారిని పట్టుకోవడం, గంజాయి, మట్కా, పేకాటలాంటి వ్యవహారాలపై దృష్టి సారించడమే వీరి పని. నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏకంగా ఇద్దరు ఏఎస్ఐలు, ఓ హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఐడీపార్టీలో పని చేస్తున్నారు. మిగిలిన స్టేషన్లలో ఇద్దరు లేదా ముగ్గురు పనిచేస్తున్నారు. జిల్లాలోని తాడిపత్రిలోనూ గంజాయి రవాణా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. ఇక్కడకు ఓ ఉన్నతాధికారిని కేటాయించినా పోలీసులు నియంత్రించలేకపోతున్నారు. గుంతకల్లు పట్టణం గంజాయి వినియోగం టాప్‌లో ఉందనే ఆరోపణలున్నాయి. రైల్వేస్టేషన్ కేంద్రంగా జిల్లాలోకి తొలుత గంజాయి ఇక్కడికే అధికంగా వస్తోందని సమాచారం. ఇక్కడ కూడా పోలీసులు సరిగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. కళ్యాణదుర్గం, రాయదుర్గంలతో పాటు పలు మండల కేంద్రాల్లో గంజాయి వినియోగిస్తున్నారు.

నిద్రమాత్రలనూ వదలని కుర్రకారు

గంజాయి సక్రమంగా దొరక్కపోవడం, చిన్న ప్యాకెట్ సైతం ఎక్కువ ధర పలుకుతుండటంతో అంత డబ్బు పెట్టి కొనలేని యువత నిద్ర మాత్రలను మింగుతున్నట్లు సమాచారం. వారి పర్సనాలిటీలను బట్టి రోజుకు ఒకటి లేదా రెండు మాత్రలు వేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలాంటి వారు ఏదైనా నేరం చేసి జైలుకు వెళ్లిన సందర్భంలో అక్కడి అధికారుల ఆరాలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. వాస్తవానికి మెడికల్ షాపుల్లో డాక్టర్ చీటీ లేనిదే నిద్రమాత్రలు ఇవ్వరు. దీంతో కొందరు యువకులు ప్రైవేట్ ఆసుపత్రుల్లోని డాక్టర్ల లెటర్ ప్యాడ్‌లు దొంగిలించి, వాటిపై నిద్రమాత్రలకు సంబంధించిన ప్రిస్క్రిప్షన్ రాసుకుని మెడికల్ షాపుల్లో చూపి తీసుకుంటున్నట్లు తెలిసింది.

రైతుల సమక్షంలోనే చర్చిద్దాం..!

నేడే.. జీడిపల్లి రిజర్వాయర్ వద్దే..

బహిరంగ చర్చపై శివరామిరెడ్డికి కాలవ ఆహ్వానం



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మే 20(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాపై సమగ్ర వివరాలతో బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ చర్చకు జీడిపల్లి రిజర్వాయర్ వద్ద సిద్ధంగా ఉంటానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంపై బురద చల్లుతున్న వైసీపీ నేత, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి చర్చకు రావాలని కాలవ ఆహ్వానించారు. రైతుల సమక్షంలో అన్ని విషయాలు చర్చిద్దామన్నారు. స్థానిక తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో బహిరంగ చర్చపై కాలవ స్పష్టత ఇచ్చారు. హంద్రీనీవాపై చర్చకు రావాలని పిలుపునిస్తే శివరామిరెడ్డి స్పందించారన్నారు. అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 21, 22 తేదీల్లో మీడియా సమక్షంలో చర్చలు జరపడానికి ఆహ్వానిస్తే ఆయన ఉరవకొండ నియోజకవర్గంలో చర్చకు సిద్ధమని అంగీకరించారన్నారు. ఆయన కోర్కె ప్రకారమే ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో హంద్రీనీవాకు అత్యంత కీలకమైన జీడిపల్లి రిజర్వాయర్ వద్దనే చర్చించటానికి సిద్ధమన్నారు. ఆయన మాట ప్రకారమే బుధవారం ఉదయం 11 గంటలకు జీడిపల్లి వద్ద సిద్ధంగా ఆయన రాక కోసం ఎదురు చూస్తానన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు రూపకల్పన స్థాయి నుంచైనా, 1995 తరువాత మారిన ప్రభుత్వాల పాలనలోనైనా, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన పనులు అందులో అవినీతి, అక్రమాలపైనైనా, రోశయ్య పాలనలో రఘువీరారెడ్డి చనువుతో జరిగిన అభివృద్ధయినా, విజిలెన్స్, కాగ్ నివేదికలపైనైనా సరే మాట్లాడేందుకు తాను సిద్ధమని వివరించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయటానికి ఇదే మంచి అవకాశంగా తాను భావిస్తున్నానని కాలవ వివరించారు.

104 మంది..

వ్యవసాయ శాఖలో ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారి సంఖ్య

పలు కేడర్లలో 19 పోస్టులు ఖాళీ

జేడీఏ కార్యాలయంలో జాబితా ప్రదర్శన

ఎట్టకేలకు ఆన్‌లైన్‌లో బదిలీల ఆప్షన్

అనంతపురం అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా వ్యవసాయ శాఖలో 104 మంది అధికారులు, సిబ్బంది సర్వీస్ ఐదేళ్లు పూర్తయింది. పలు కేడర్లలో 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ మేరకు జేడీఏ కార్యాలయంలోని నోటీసు బోర్డులో జాబితాను ప్రదర్శించారు. ఉమ్మడి అనంత జిల్లాలో 25 మంది ఏడీఏలు పనిచేస్తుండగా.. ఐదుగురికి ఐదేళ్లు పూర్తయ్యాయి. ఇందులో తాడిపత్రి, మడకశిర, ధర్మవరం, పెనుకొండ, కదిరి ఏడీఏ పోస్టులున్నాయి. 116 మంది పనిచేస్తుండగా.. 31 మంది ఏఓలకు ఐదేళ్ల సర్వీస్ కాలం పూర్తయింది. మరో 9 ఏఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్ 1 ఏఈఓ పోస్టులు 24, గ్రేడ్-2 పోస్టులు 115 ఉండగా.. ఇందులో 55 మందికి ఐదేళ్ల సర్వీసు పూర్తయింది. 2 ఏఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 27 మంది సీనియర్ అసిస్టెంట్లు ఉండగా.. ఐదుగురి సర్వీస్ ఐదేళ్లు పూర్తయింది. మరో 2 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 38 మంది జూనియర్ అసిస్టెంట్లు ఉండగా.. ఏడుగురు జూనియర్ అసిస్టెంట్ల సర్వీస్ ఐదేళ్లు పూర్తయింది. ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. 15 మంది టైపిస్టులు పనిచేస్తుండగా.. ఒకరి సర్వీస్ ఐదేళ్లు పూర్తయింది. మరో 7 టైపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా బదిలీ కోసం ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఐదేళ్లలోపు వారికి బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

ఎట్టకేలకు ఆప్షన్

వ్యవసాయ శాఖకు సంబంధించి ఎట్టకేలకు ఆన్‌లైన్‌లో అధికారులు, సిబ్బంది బదిలీల కోసం ఆప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు కల్పించారు. మంగళవారం ఉదయమే ఆన్‌లైన్ ఆప్షన్ అవకాశం ఇస్తారని అందరూ ఎదురుచూశారు. మంగళవారం సాయంత్రం ఆన్‌లైన్‌లో బదిలీల కోసం ఆప్షన్ ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. ఇదివరకు టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించాలని భావించారు. ఆన్‌లైన్ ఆప్షన్ ఇవ్వడంలో ఆలస్యం కావడంతో ఈనెల 22గానీ, 23గానీ ఉమ్మడి జిల్లాకు చెందిన సదరు సిబ్బందికి అనంతపురం జేడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలకు జేడీఏ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీలు ఖరారు చేయనున్నారు. అలాగే ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చేందుకు గడువు విధించారు. ఈనెల 26న జోన్-4 పరిధిలోని అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏల జాబితా పరిశీలన అనంతపురం జేడీఏ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల జేడీఏలు, అధికారులు హాజరుకానున్నారు. పరిశీలన అనంతరం జాబితాను వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు పంపనున్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, మే20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జడ్పీలోని సమావేశ మందిరంలో మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జడ్పీటీసీలు, ఎంపీపీలు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎంపీలు, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, ఉమ్మడి జిల్లాకి చెందిన అన్నిశాఖల అధికారులకు జడ్పీ వర్గాలు సమాచారం ఇచ్చాయి.

ధర్మకర్తల మండలి కోసం దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి, గంగాదేవిపల్లిలోని గంగాభవాని, రాప్తాడులోని పండమేటి వెంకటరమణస్వామి దేవాలయాలకు సంబంధించి ధర్మకర్తల మండళ్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ రామాంజనేయులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు దరఖాస్తులను జూన్ 2వ తేదీలోపు జిల్లా కేంద్రంలోని హెచ్చెల్సీ కాలనీలో గల దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

పెనుకొండ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కియ ఏఎస్ఐ వెంకటరమణ మంగళవారం తెలిపారు. డిగ్రీ చదువుతున్న యువతి ఈనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహా ప్రాధాన్యం

మహానాడు నిర్వహణలో ఉమ్మడి జిల్లా నేతలకు బాధ్యతలు

అన్ని కమిటీల్లోనూ చోటు

సభా నిర్వహణ కమిటీలో ముగ్గురికి కీలక పాత్ర



పయ్యావుల కేశవ్



సవిత



కాలవ శ్రీనివాసులు



ప్రభాకర్ చౌదరి



బీకే పార్థసారథి



ఎంఎస్ రాజు



బండారు శ్రావణిశ్రీ



పూల నాగరాజు



బీవీ వెంకటరాముడు

అనంతపురం, మే 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు వేడుకల నిర్వహణ కమిటీలో ఉమ్మడి అనంత జిల్లా నాయకులకు ప్రాధాన్యం లభించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మహానాడు నిర్వహణ కమిటీల జాబితాను మంగళవారం విడుదల చేశారు. కడప జిల్లాలో ఈనెల 27, 28, 29వతేదీల్లో మహానాడు వేడుకలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు మహానాడు వేడుకల విజయవంతానికి సంబంధించి పలు కమిటీలను నియమించారు. మహానాడు నిర్వహణలో అత్యంత కీలకమైన సభా నిర్వహణ కమిటీలో ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు ప్రజాప్రతినిధులకు చోటు కల్పించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజులు సభ్యులుగా ఉన్నారు. సమన్వయ కమిటీ సభ్యులుగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు జిల్లా నుంచి ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా మహానాడు నిర్వహణలో ప్రధాన కీలక కమిటీ అయిన ఆర్థిక వనరుల కమిటీకి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కో కన్వీనర్ బాధ్యత అప్పగించారు. తీర్మానాల కమిటీలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు చోటు కల్పించారు. వసతి కమిటీలో సభ్యులుగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరిని నియమించారు. భోజనాల కమిటీ సభ్యులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిలను నియమించారు. మీడియా కమిటీలో ఆ పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడును సభ్యుడిగా నియమించారు.



ప్రకాష్‌నాయుడు

రవాణా కమిటీ సభ్యులుగా ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజుకు బాధ్యతలు ఇచ్చారు. ప్రతినిధుల నమోదు కమిటీలో సభ్యులుగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి అవకాశం ఇచ్చారు. వలంటీర్ కమిటీ సభ్యులుగా రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్ నాయుడుని నియమించారు.

4.0తో పెట్టుబడుల ప్రవాహం

- ప్రభుత్వంపై కుదిరిన నమ్మకం
- జిల్లా వైపు పారిశ్రామిక వేత్తల చూపు
- రూ.11,920 కోట్లతో ఎనర్జీ ప్రాజెక్టులు
- 4,130 మందికి ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి/అనంతపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం కుదరడంతో ఉమ్మడి జిల్లా వైపు పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి 4.0 పాలసీని తెచ్చింది. పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో పారిశ్రామికవేత్తలంతా ఇటువైపే చూస్తున్నారు. ఇప్పటికే మడకశిర నియోజకవర్గంలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమతోపాటు కల్లుమర్రి గ్రామాల పరిధిలో 15 వేల ఎకరాల్లో రూ. 7500 కోట్లతో సోలార్ పార్క్ ఏర్పాటుకు సోలార్ పరిశ్రమలు ముందుకువచ్చాయి. బస్సుల బాడీ బిల్డింగ్ తయారీ యూనిట్‌ను గుడిపల్లిలో 70.7 ఎకరాల్లో నెలకొల్పనున్నారు. రూ.1046 కోట్ల పెట్టుబడితో 2381 మందికి ఉపాధి కల్పించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. చిలమత్తూరు మండలం టేకులోడులో 1105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా జిల్లాలో ఉపాధి కల్పన లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈల పార్కు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఐదు పారిశ్రామిక హబ్‌ల ఏర్పాటుకు 35వేల ఎకరాల భూసేకరణకు వేగం పెంచారు. తాజాగా జిల్లాలో రూ. 11920 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి రెండు ఎనర్జీ ఉత్పత్తి సంస్థలు ముందుకు వచ్చాయి. వీటి ద్వారా 4130 మందికి ఉపాధి అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోదం తెలిపారు. ఈనేపథ్యంలో జిల్లాకు ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులు క్యూ కడుతున్నాయి.

కేబినెట్ మీటింగ్‌లో పలు ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో జిల్లాలో పలు పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ప్రతిపాదనలకు సంబంధించి సిఫారసులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఉమ్మడి జిల్లాలో బొండాడ ఇంజనీరింగ్ సంస్థ 2000 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు పెట్టుకున్న అభ్యర్థనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.9000 కోట్ల పెట్టుబడితో స్థాపించనున్న ఈప్రాజెక్టు ద్వారా 3900 మందికి ఉద్యోగ అవకాశలు లభించనున్నాయి. ఈ సంస్థ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. మడకశిర మండలం రాళ్ల అనంతపురం, కురబరహళ్లి ప్రాంతాల్లో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్‌కు చెందిన 300.30 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ సంస్థకు బదిలీ చేయడానికి మంత్రి మండలి ఆమోదం తెల్పింది. ఈప్రాజెక్టు ద్వారా రూ.2920 కోట్ల పెట్టుబడితో 230 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. తాడిమర్రి మండలం పెద్దకోట్లలో అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థకు 500 మెగావాట్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టుకు 12.87 ఎకరాల భూమికి ఎకరాకి రూ. 5లక్షల చెప్పున కేటాయించేందుకు ఆమోదం తెలిపారు.

నేటి నుంచే టీచర్ల బదిలీలు

సంఘాల రాష్ట్ర నేతలతో

కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ చర్చలు

బదిలీలపై వెబెక్స్ ద్వారా డీఈఓకి ఆదేశాలు

11 మండలాల నుంచి కంప్యూటర్లు సిద్ధం

నేడు హెచ్‌ఎంల బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో 178 హెచ్‌ఎం ఖాళీలు



రాష్ట్ర అధికారుల వెబెక్స్‌కు హాజరైన అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు, ఇతర అధికారులు

కేటగిరీ	వర్కింగ్ టీచర్లు
హెచ్‌ఎంలు	375
ప్రైమరీ హెచ్‌ఎంలు	329
ఎస్‌జీటీలు	7230
స్కూల్ అసిస్టెంట్లు	6850
మొత్తం	14,748

అనంతపురం విద్య, మే 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు విద్యాశాఖ పచ్చజెండా ఊపింది. బుధవారం నుంచి బదిలీల ప్రక్రియ మొదలుకానుంది. విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలతో మంగళవారం జరిగిన చర్చల్లో ఉపాధ్యాయ సంఘాల నేతలు చేసిన పలు డిమాండ్లకు అంగీకారం లభించింది. వెంటనే అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులతో వెబెక్స్ నిర్వహించి బదిలీలు ప్రారంభించాలని ఆదేశాలిచ్చారు. అనంతపురం జిల్లా నుంచి డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ క్రిష్టయ్య ఇతర జిల్లా విద్యాశాఖాధికారులు వెబెక్స్‌కు అటెండ్ అయ్యారు. బుధవారం నుంచీ బదిలీలు ప్రారంభంకానుండటంతో అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. అనంతపురం నగరానికి సమీపంలో ఉన్న సుమారు 11 మండలాల నుంచి అదనంగా కంప్యూటర్లు, లాప్‌ట్యాప్‌లు తెప్పించడంతోపాటు, శారదాస్కూల్‌లో కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు.

2017 తర్వాత మళ్లీ ఆఫ్‌లైన్....?

ఉపాధ్యాయ బదిలీలపై జరిగిన చర్చల్లో సంఘాల నేతలు ఎస్‌జీటీలకు ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇందుకు రాష్ట్ర అధికారులు ఆమోదం తెలిపినట్లు స్పష్టమవుతోంది. అయితే అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. అయితే హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్‌లో, ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్‌లో బదిలీల అంశంపై సంఘాల నేతల నుంచి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2017లో ఆఫ్‌లైన్ బదిలీలు నిర్వహించారు. 2017 తర్వాత ఆన్‌లైన్‌లోనే నిర్వహించారు. ఇప్పుడు ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్ బదిలీలు అనగానే.. అనేక అక్రమాలు, పైరవీలకు తావు లేకపోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సంఘాల నేతలు బదిలీల్లో పావులు కదపడానికే ఆన్‌లైన్‌కు కాకుండా ఆఫ్‌లైన్‌కు మొగ్గు చూపారన్న ఆరోపణలు వస్తున్నాయి. పారదర్శకత ఉండదని, ఆలస్యం అవుతుందని ఈ విధానాన్ని కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలతోపాటు, జిల్లా విద్యాశాఖాధికారులు కూడా వ్యతిరేకిస్తున్నారు. వేలాది మంది ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్ బదిలీల నిర్వహణ అంటే తలపోటేనంటూ అధికారులు, సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచే హెచ్‌ఎంల బదిలీలు

తొలుత ప్రధానోపాధ్యాయుల బదిలీలు నిర్వహించనున్నారు. బుధవారం నుంచి హెచ్‌ఎంల బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 178 ప్రధానోపాధ్యాయుల ఖాళీలున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 375 మంది హెచ్‌ఎంలు ఉన్నారు. వీళ్లలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఈ ఏడాది మే 31న ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకునే వారు తప్పనిసరిగా బదిలీలకు అప్లై చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పనిచేస్తున్న ప్లేస్‌లో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు రిక్వెస్ట్ కింద బదిలీకి అప్లై చేసుకోవచ్చు. విద్యాశాఖ ఆధ్వర్యంలో శారదాస్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా తప్పనిసరి బదిలీ అయ్యే హెచ్‌ఎం ద్వారా అధికారులే అప్లై చేయించేలా ఏర్పాట్లు చేశారు.

ఐదేళ్లు పూర్తయ్యే హెచ్‌ఎంలు తప్పనిసరి: ప్రసాద్‌బాబు, డీఈఓ

ఉపాధ్యాయ బదిలీలు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి హెచ్‌ఎంల బదిలీలు ఉంటాయి. ఈ నెలాఖరుకు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకునే హెచ్‌ఎంలు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. రెండేళ్ల సర్వీసు పూర్తయిన హెచ్‌ఎంలు సైతం రిక్వెస్ట్ దరఖాస్తు చేసుకోడానికి సిద్ధంగా ఉండాలి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సంజీవ్ కరుణ మృతదేహం

గుత్తి రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన రైతు సంజీవ్‌కరుణ (29) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు... సంజీవ్‌కరుణ తనకున్న ఆరెకరాల పొలంలో కొన్నేళ్ల నుంచి వేరుశనగ, ఆముదం, పత్తి పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయాడు. దీంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో పంటసాగుకు పెట్టుబడి లేక తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున ఇంటిలో ఉరి వేసుకున్నాడు. ఉదయం కుటుంబసభ్యులు గమనించి అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి మొత్తం రూ.8 లక్షల అప్పులు ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మినీ మహానాడులో విషం తాగిన ఎస్సీ సెల్ నాయకుడు

కష్టపడినా న్యాయం జరగలేదని ఆవేదన



మినీ మహానాడులో పురుగుల మందు తాగుతున్న వెంకటేష్



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా

అనంతపురం మే 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడులో మంగళవారం కలకలం రేగింది. పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వెంకటేష్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించారు. అక్కడున్నవారు వెంటనే ఆయనను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నా, మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే బెంగళూరుకు తరలించారు. నగరంలోని కమ్మభవన్‌లో అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడును ఎమ్మెల్యే దగ్గుపాటి అధ్యక్షతన మంగళవారం ప్రారంభించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడిన తర్వాత ఎమ్మెల్యే మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే సమావేశంలో కూర్చున్న ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వెంకటేష్ ఒక్క సారిగా వేదిక వద్దకు వచ్చి వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగి అక్కడే కింద పడిపోయాడు. ఈ హఠాత్ పరిణామంతో ఒక్కసారిగా సమావేశంలో గందరగోళం చోటు చేసుకుంది. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న తనకు ప్రాధాన్యం ఇవ్వలేదన్న ఆవేదనతో వెంకటేష్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు అతని సన్నిహితులు చెబుతున్నారు. ఆస్పత్రిలో వెంకటేష్‌ను ఎమ్మెల్యే, ఎంపీ పరామర్శించారు. అక్కడే ఉన్న వెంకటేష్ భార్యను ఎమ్మెల్యే ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆందోళన చెందవద్దని, వైద్య ఖర్చులు పూర్తిగా తానేభరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వెంకటేష్‌తో అన్ని విషయాలపై మాట్లాడి, న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



లక్ష్మీదేవి మృతదేహం

పామిడి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టకిందపల్లి సమీపాన మంగళవారం రోడ్డు ప్రమాదంలో లక్ష్మీదేవి (25) మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వజ్రకరూరుకు చెందిన లక్ష్మీదేవి తమ్ముడు వీరాతో కలిసి ద్విచక్రవాహనంలో పామిడికి బయల్దేరింది. కట్టకిందపల్లి సమీపాన ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో లక్ష్మీదేవికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఆమెను హుటాహుటిన వజ్రకరూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంతకల్లు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గుంతకల్లులో చికిత్స పొందుతూ మృతిచెందింది. లక్ష్మీదేవికి భర్త లక్ష్మీనారాయణ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ మార్ఫింగ్ ఫొటో, వీడియోల షేరింగ్

ఒకరి అరెస్టు

గార్లదిన్నె, మే 20(ఆంధ్రజ్యోతి): మార్ఫింగ్ చేసిన ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంపిన వ్యక్తిని గార్లదిన్నె పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కల్లూరుకు చెందిన మహబూబ్‌బాషా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు బీజేపీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ మహ్మమద్ గౌస్‌బాషా మంగళవారం నిందితుడిని తరిమెల క్రాస్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను పంపి, వారి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ముగిసిన ఈఏపీసెట్ ఫార్మసీ స్ట్రీమింగ్

నేటి నుంచి ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఈఏపీసెట్‌లో భాగంగా ఫార్మసీ స్ట్రీమింగ్ పరీక్షలు ముగిశాయి. రెండోరోజు మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,044 మంది విద్యార్థులకుగాను 2,827 మంది రాశారు. బుధవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం పడింది. అనంతపురం, బెళుగుప్ప, కూడేరు, ఉరవకొండ, రాప్తాడు, డి హిరేహాళ్ తదితర మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా బంద్

బత్తలపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను బంద్ చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శివయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని మాల్యవంతం, ఎం చెర్లోపల్లి, చీమలనాగేపల్లి, రాఘవంపల్లి, ముస్టురు, పోట్లమర్రి, వెల్పుమడుగు, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి, సంజీవపురం, ఎర్రయపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

నేడు పుట్టపర్తిలో మినీ మహానాడు

పుట్టపర్తి రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టపర్తి నియోజకవర్గస్థాయి మినీ మహానాడు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గురువారం కాకుండా.. బుధవారమే నిర్వహిస్తున్నామని, ఈ మార్పును నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు.

జయప్రదం చేయండి

ఓబుళదేవరచెరువు: పుట్టపర్తిలో బుధవారం నిర్వహించే మినీమహానాడును జయప్రదం చేయాలని మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి కోరారు. ఉదయం 10.30గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానాలు భారీగా తరలి రావాలని కోరారు.

మినీ మహానాడుకు తరలిరండి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం నిర్వహించే మినీ మహానాడుకు భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు. స్థానిక గాంధీనగర్ టీడీపీ కార్యాలయంలో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్ మంగళవారం మాట్లాడారు. స్థానిక గాంధీనగర్‌లోని మారుతీరాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఇందులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, నియోజకవర్గ అబ్జర్వర్ నాగేంద్రకుమార్ పాల్గొంటారని తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతి



నరసింహులు (ఫైల్)

బుక్కపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పంచాయతీ వార్డు మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకుడు మిద్దెన రసింహులు (64) మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని ఫోన్ పరామర్శించారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



నల్లమాడలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నల్లమాడ, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం కుట్టుశిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద మహిళలకు 90 రోజులు శిక్షణ ఇచ్చి, అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తుందని అన్నారు. అనంతరం వంకరకుంట సమీపంలోని చిన్నమ్మ పరుషను సందర్శించారు. చిన్నమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

● పుట్టపర్తిరూరల్: జిల్లాకేంద్రంలోని గోపురం రోడ్డులో ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అర్బన్ కన్వీనర్ రామాంజినేయులు, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బెస్త చలపతి, నాయకులు బేకరి నాయుడు, ఉమాపతి యాదవ్ పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



ఆర్ఐ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నంబులపూలకుంట, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్ఐ శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు, సీపీఎం నాయకులు గంగిరెడ్డి, మల్లిరెడ్డి, నారాయణరెడ్డి, ఖలందర్ పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

ధర్మవరం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోట గ్రామంలో తాగునీటి సమస్య ఉంది. దీన్ని గ్రామస్థులు ఇటీవల మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఆ గ్రామంలో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించడంలో భాగంగా మంగళవారం ఆ గ్రామంలో బోరు వేయించారు. ఈ పనులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హరీష్‌బాబు ప్రారంభించారు. ఇందులో బీజేపీ నాయకులు నేలకోట రాము, బిల్లే శ్రీనివాసులు, సుబ్బరావుపేట పవన్‌రెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న బీజేపీ నాయకుడు హరీష్‌బాబు

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

కదిరి మినీ మహానాడులో ఎమ్మెల్యే కందికుంట



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మే 20(ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వీఆర్ గ్రాండ్‌లో టీడీపీ మినీ మహానాడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ మహిళ కార్యకర్తలను నడిరోడ్డులో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ మద్యం కుంభకోణంలో పూర్తిస్థాయిలో మునిగిపోయిందని, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లడం తథ్యమని జోష్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. నూతన మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్‌షాద్ దున్నీషా, వైస్‌ఛైర్మన్ రాజశేఖరాచారి, సుధారాణి, గాండ్లపెంట ఎంపీపీ సోముశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆంజనప్ప మాట్లాడుతూ.. టీడీపీ కార్యకర్తలు కష్టాన్ని పార్టీ తప్పక గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు వహీదుసేన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీవీ పవన్ కుమార్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు, మహిళ నాయకురాలు ఫర్వీన్‌భాను, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జీలు, మండల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు సమర్పణ

గాండ్లపెంట, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాదులవాండ్లపల్లి గ్రామంలో బోగాదమ్మకు గ్రామస్థులు మంగళవారం బోనాలు సమర్పించారు. మూడు రోజుల పాటు బోగాదమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. చివరి రోజైన మంగళవారం అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



అలంకరణలో అమ్మవారు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ప్రజావ్యతిరేక విధానాలు వీడాలి: సీఐటీయూ





ధర్మవరం, కదిరిలో ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ధర్మవరం, మే 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు వీడి, రైతులు, కార్మికులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. సీఐటీయూ పిలుపుమేరకు మంగళవారం దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా పట్టణంలోనూ ఆందోళన చేపట్టారు. సీపీఎం కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిరసన చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజన్ కుబ్రాకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌హెచ్‌బాషా, మారుతి, ఎల్ ఆదినారాయణ, హైదర్‌వలీ, ఖాదర్‌బాషా, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: కార్మిక సంఘాల నాయకులు స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి కాలేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ మురళీక్రిష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ లక్ష్మీనారాయణ, రామమోహన్, ముస్తాక్, తాహిల్, ఆంజనేయులు, అంగన్‌వాడీ మాబున్నీషా, సుజాత, శారద, మున్సిపల్ తిరుపాల్, జనార్ధన్, సివిల్ సప్లై బాబాఫక్రుద్దీన్, రైతు సంఘం బడా సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఎం, సీఐటీయూ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, మండల కార్యదర్శి పోతలయ్య, పక్కీరప్ప, చాంద్‌బాషా, ఆదినారాయణ, ఓబులేసు, వెంకటనారాయణ, బాబు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



నాడు గుంతల రోడ్డు.. నేడు మరమ్మతుల అనంతరం

నంబులపూలకుంట, మే 20(ఆంధ్రజ్యోతి): కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. ఆ రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో నీరు నిలువ ఉండటంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కదిరి-రాయచోటి రోడ్డు పనుల్లో భాగంగా మంగళవారం ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తాడిమర్రిలో తిరంగా ర్యాలీ

తాడిమర్రి, మే 20(ఆంధ్రజ్యోతి): పాక్ ఉగ్రవాదుల స్థావరాలపై భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అవ్వడంతో బీజేపీ నాయకులు మండల కేంద్రంలో మంగళవారం తిరంగ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామ్మోహన్, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ క్రిష్ణవేణి, నాయకులు వన్నూర్‌రెడ్డి పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



సోలార్ ప్యానల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. మంగళవారం పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లోఈ పథకంపై నిర్వహించిన నియోజకవర్గస్థాయి అవగాహన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ ముఖ్యమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సోలార్ యూనిట్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే వినియెగదారులకు బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన నమూనా రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, కదిరి డీఈ మోసేస్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతి



అన్నారెడ్డి బాలిరెడ్డి (ఫైల్)

కదిరి, మే 20(ఆంధ్రజ్యోతి): పులివెందల పట్టణంలో చిన్నన్నరూమ్ కాలనీలో విశ్రాంత ప్రిన్సిపాల్ అన్నారెడ్డి బాలిరెడ్డి(82) మంగళవారం మరణించారు. ఆయన తలుపుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించారు. ఆయన గతంలో నేత్రదానికి అంగీకరించి ఉండటంతో ఆయన నేత్రాలను స్నేహామృత హస్త సేవా సమితి వారు స్వాధీనం చేసుకున్నారు. వాటిని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి అందజేసినట్లు వారు చెప్పారు.

విచారణపై ఎందుకీ కాలయాపన?

● అధికారులకు ముడుపులు ముట్టాయా..? ● సర్వే నంబరు 650-2లో అక్రమాలపై రిలేదీక్షలు

ధర్మవరం, మే 20(ఆంధ్రజ్యోతి): 'పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోని సర్వే నంబరు 650-2 అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టడంలో అధికారులు ఎందుకింత కాలయాపణ చేస్తున్నారు. రెండు నెలల నుంచి కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదు. మీపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయా.. లేక మీరు కూడా ఏమైనా ముడుపులు తీసుకున్నారా.. అనర్హులకు పట్టాలు రద్దు చేసి.. అర్హులకు ఇవ్వడంలో ఎందుకింత ఆలస్యం చేస్తున్నారు.' అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో ప్లంబర్స్, కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు అర్హులకు న్యాయం చేయకపోతే వారిని రోడ్డు మీదకు తీసుకువచ్చే విధంగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని... తహసీల్దార్ కార్యాలయా న్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి రమణ, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్ కార్మికసంఘం అధ్యక్షుడు గోవిందరాజు లు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయ ణ, మహిళా సమాఖ్య నాయకురాళ్లు పాల్గొన్నారు.



రిలే దీక్ష చేస్తున్న నాయకులు

క్రైం న్యూస్..

యువకుడి ఆత్మహత్య

ధర్మవరం, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గానగర్‌కు చెందిన చిన్న వెంకటరాముడు, అలివేళమ్మ దంపతుల కుమారుడు మురళీ మోహన్ (32) కడుపు నొప్పి తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకున్నా.. ప్రయోజనం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. దీంతో మంగళవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. అలివేళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి

నంబులపూలకుంట, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లిలోకి అంజనమ్మ (54) ప్రమావశాత్తు బావిలో పడి మంగళవారం మరణించింది. లంజనమ్మ మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. మంగళవారం గ్రామ సమీపంలోని బోనాసి బావి వద్ద ఉన్న ఆమె మూర్ఛరావడంతో ఆ బావిలో పడి మరణించింది. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించారు. బావితో తక్కువ నీరు ఉండటంతో.. అందులో ఆమె పడి ఉంటాన్ని గమనించిన స్థానికులు వెంటనే వెలికి తీశారు. అప్పటికే ఆమె మరణించినట్లు గుర్తించారు. ఆమెకు భర్త నారాయణరెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తనకల్లు, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్లవారిపల్లికి చెందిన నాగరాజు పురుగుల మందుతాగి మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న బంధువులు అతన్ని వెంటనే తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కదిరికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు బంధువులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

మహిళకు గాయాలు

తనకల్లు, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి గ్రామానికి చెందిన నరసింహులు, నాగవేణి తమ పిల్లలతో మంగళవారం ద్విచక్రవాహనంలో తనకల్లు నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గ మధ్యంలో పెట్రోల్ బంక్ వద్ద కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో నాగవేణికి గాయాలు కాగా వందేమాతరం టీమ్ ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారుగడ్డి మేసి 13 గొర్రెలు మృతి



గొర్రెల కళేబరాలు

నంబులపూలకుంట, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందురాజులపల్లిలో కారుగడ్డి మేసి 13 గొర్రెలు మంగళవారం మరణించాయి. గ్రామానికి సమీపంలో కారు గడ్డి మేసిన గొర్రెలు.. వెంటనే నీరు తాగడంతో ఒక్కసారిగా మరణించాయని గొర్రెల యజమాని రాము వాపోయాడు. దీంతో తనకు రూ.మూడు లక్షల దాకా నష్టం జరిగిందని విలపించాడు. అప్పులు చేసి 80 గొర్రెలను కొనుగోలు చేసు.. మేపుకుంటున్నానని, ఇందులో 13 గొర్రెలు చనిపోయాయని అన్నాడు. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

అక్రమ మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

పుట్టపర్తిరూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పుట్టపర్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో పోలీసులకు పట్టుబడిన రూ 2.0 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని అధికారులు మంగళవారం ధ్వంసం చేశారు. కర్ణాటక మద్యం 133.2 లీటర్లు, ఆంధ్ర మద్యం 112.3 లీటర్లు, నాటుసారాయి 28 లీటర్లు, కల్లు ఎనిమిది లీటర్లు ధ్వంసం చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ తెలిపారు. ఆయన వెంట పుట్టపర్తి డివిజన్ సీఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు




ధర్మవరం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పునేసినపల్లిలో శ్రీ కొల్లాపురమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి .. ఆలయ పూజారి వన్నూరప్ప మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్దఎత్తున గ్రామస్థులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రివేళ భజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

'పసుపులేటిపై చర్యలు తీసుకోవాలి'

ఓబుళదేవరచెరువు, మే 20 (ఆంధ్రజ్యోతి): సోషియల్ మీడియాను వేదికగా చేసుకొని పలువురు ప్రముఖ రాజకీయ నాయకులపై అసభ్యర పోస్టులు పెడుతున్న పసుపులేటి రమేష్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసనాయక్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పసుపులేటి రమేష్ సోషియల్ మీడియాలో పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని, ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

న్యూస్ బాక్స్

ఘనంగా శ్రీవారి పార్వేట ఉత్సవం



లక్ష్మీవెంకటేశ్వరుడికి సహస్ర దీపాలంకరణ

పెనుకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీ వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు మంగళవారం స్వామివారి పార్వేట ఉత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు రాజీవ్‌చార్యులు, మధుసుధనాచార్యులు, రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి విద్యారాధన, నిత్య హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ, కీర్తనలు, పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.

డివైడర్‌ను తొలగించారు.. వదిలేశారు..



డివైడర్ల మధ్య ఏర్పడిన గుంత

సోమందేపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లోని కొత్తపల్లి క్రాస్ వరకు గతంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా డివైడర్లు నిర్మించారు. గీతానగర్ ప్రాంతంలో డివైడర్లు వెడల్పు అధికంగా ఉండి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావడంతో ఇటీవల వాటిని తొలగించారు. రెండు రోడ్లమధ్య గుంత ఏర్పడి ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు అంటున్నారు. నెలలు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. డివైడర్ గ్యాప్‌ను సిమెంటు రోడ్డుతో ఫిల్‌చేసి తక్కువ వెడల్పుతో డివైడర్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు టీడీపీ నాయకులు చంద్ర వెల్లడించారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయండి

-సీఐటీయూ నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెనుకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి హరి, సీఐటీయూ కన్వీనర్ బాబావలి, తహసీల్దార్‌కు వినతిని అందిస్తూ కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం వెంటనే అమలు చేయాలని రైతులు పండించే అన్ని పంటలకు 2.50శాతం ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలకు చట్టం చేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగరాజు, బావమ్మ, మహబూబ్ బాష, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనుమ మారెమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న నాయకులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మడకశిర రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిదాలగొంది పంచాయతీ కేంద్రంలో కనుమ మారెమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగాపండాలని కోరుకున్నాట్లు భక్తులు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండలకన్వీనర్ లక్ష్మీనారాయణ. ప్రధాన కార్యదర్శి కోట్లరంగేగౌడ్, మాజీ ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండల కన్వీనర్‌గా ప్రసాద్ ఎన్నిక



ప్రసాద్

పెనుకొండ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పెనుకొండ రూరల్ కన్వీనర్‌గా అడదాకులపల్లికి చెందిన కురుబ ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి నిర్ణయాన్ని తీసుకున్నారు. గతంలో పనిచేస్తున్న శెట్టిపల్లి సిద్దయ్యకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పజెప్పిన మంత్రి సవితకు, తెలుగుదేశం పార్టీకి రుణపడి ఉంటానని, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, కేశవయ్య, చిన్నవెంకటరాముడు, శ్రీనివాసులు, త్రివేంద్ర, రఘు, లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా ఆగిన మార్కెట్ షెడ్ నిర్మాణం

ప్రారంభంకాకనే శిథిలావస్థకు..



శిథిలావస్థకు చేరిన మార్కెట్ షెడ్

చిలమత్తూరు, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంత మార్కెట్ షెడ్ ప్రారంభంకాకనే శిథిలావస్థకు చేరుకుంటోంది. ఎన్నో ఏళ్లుగా ఆరుబయల్లోనే కొనసాగుతున్న వారపు సంత కోసం గతంలో నాబార్డు ముందుకు వచ్చి రూ.25 లక్షలతో మార్కెట్ గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు ప్రారంభమయ్యాయి. అయితే షెడ్డు పైకప్పు వరకు పూర్తయ్యింది. తరువాత నిధులు రాక పనులు ఆగిపోయాయి. నిర్మాణం ఆగి తొమ్మిదేళ్లు అవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో నిధులు లేక ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మార్కెట్ షెడ్ పరిస్థితి తయారైంది. వారపు సంత మాత్రం ఎప్పటిలాగానే రోడ్డుపైనే జరుగుతోంది. షెడ్ మాత్రం శిథిలావస్థకు చేరుకుంటోంది. షెడ్‌కి ఏర్పాటుచేసిన ఇటుక దిమ్మెలు సైతం కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వాటిని అలాగే ఉంచితే త్వరలో నేలమట్టం కావడం ఖాయమని చిరువ్యాపారులు పేర్కొంటున్నారు. దాదాపు 70 శాతం పూర్తయిన షెడ్ నిర్మాణాన్ని అందుబాటులో ఉన్న నిధులతో పూర్తి చేస్తే వారపు సంత వ్యాపారులకు, ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు. ప్రతి శనివారం జరిగే వారపు సంత ఆరుబయల్లోనే, మురుగు కాలువ మధ్య కొనసాగుతోంది. భవనాలు లేని కారణంగా వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంతల ద్వారా పంచాయతీలకు బాగానే ఆదాయం వస్తోంది. ఈ నేపథ్యంలో మార్కెట్ షెడ్ నిర్మించాలని కోరుతున్నారు.

కల్లాల్లో రైతుల అగచాట్లు

వర్షాలకు తడుస్తున్న మొక్కజొన్న గింజలు



కల్లాల్లో మొక్కజొన్న విత్తనాలను ఆరబెట్టిన రైతులు

పెనుకొండ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నకు అన్ని కష్టాలే మిగులుతున్నాయి. పంట సాగు మొదలు నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న గింజలు తడుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు మొక్కజొన్న రైతులు కల్లాలోనే నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలకు మొక్కజొన్న గింజలు తడిసి ఫంగస్‌వచ్చి ధరలు తగ్గిపోతాయన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. రబీ సీజన్‌లో పెనుకొండ, రొద్దం, మండలాల్లో విస్తారంగా వ్యవసాయ బోరుబావుల కింద మొక్కజొన్న పంట సాగుచేశారు. మొక్కజొన్న మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.2200 పలుకుతోంది. మొక్కజొన్న పంటలను నూర్పిడి యంత్రాలతో తొలగించి గింజలను కల్లాల్లో ఎండబెడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తడిచిపోతున్నాయి. నాలుగురోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించడంతో మొక్కజొన్న ధరలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

పెనుకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మొక్కల పెంపకం అవసరమని సాహితీగగన్మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పెనుకొండ కొండపై సాహితీగగన్మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది 5వేల మొక్కలు నాటడం లక్ష్యమన్నారు. ఇప్పటివరకు 1200మంది మొక్కలు నాటామన్నారు.

'రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోండి'

అమరాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించారని వెంటనే చర్యలు తీసుకోవాలని గౌడనకుంట గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి శర్మకు మంగళవారం వినతిపత్రం అందించారు. అమరాపురం మండల పరిధిలోని గౌడనకుంట గ్రామంలో ఇందిరమ్మ కాలనీకి పోయే రోడ్డును కొంతమంది ఆక్రమించుకుని, ఫెన్సింగ్ వేశారని, వర్షం వస్తే తమ ఇండ్లలోకి నీరు వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు జయరామ, వీరకేతప్ప, నవీన్ కుమార్ పంచాయతీ కార్యదర్శిని కోరారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

గోరంట్ల, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో దేవాంగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన 16మంది విద్యార్థులకు మంగళవారం పురస్కారాలు అందించారు. మండల వ్యాప్తంగా దేవాంగ, తొగట, నేత కార్మికుల పిల్లలు పది, ఇంటర్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన 16మందిని గుర్తించి పురస్కారాలను ప్రదానం చేశారు. ఇందుకోసం టీడీపీ నాయకులు నిమ్మల శ్రీధర్, నాగరాజు, వెంకటరమణ, కట్ట నారాయణ, భార్గవులు రూ.23వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జగదీశ్వర్, నాగభూషణ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

రేపటి ర్యాలీకి తరలిరండి

హిందూపురం, మే 20(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం హిందూపురంలో జరిగే ర్యాలీకి పెద్దఎత్తున తరలిరావాలని హిందూసురక్ష సేవాసమితి నాయకులు మంగళవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. గురువారం ఉదయం సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉదయం 10గంటలకు హనుమాన్ శోభయాత్ర బైక్‌ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. ఈ ర్యాలీకి అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

పరిగి, మే 20(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ శోభయాత్ర గురువారం నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు పరిగి వేణుగోపాల్‌రావు తెలిపారు. మండలకేంద్రంలోని సీతారాంపురం కాలనీ నుంచి పైడేటి సర్కిల్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువత బైక్‌ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ మహాశక్తి కళాశాల ఆధ్వర్యంలో జూన్-1న కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్‌వాయిస్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది పాసై, ఇంటర్, డిగ్రీ, 18-30ఏళ్ల లోపు నిరుద్యోగ యువతీ యువకులకు ఈ అవకాశం ఉందన్నారు. వివరాలకు 9676706976కు సంప్రదించాలన్నారు.

గొడవలకు వెళ్లకండి: సీఐ

హిందూపురం, మే 20(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో చిన్న చిన్న విషయాలకు గొడవలకు వెళ్తే కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందని రూరల్ సీఐ జనార్దన్ హెచ్చరించారు. మంగళవారం కోడిపల్లిలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లలో సోదాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు నరేంద్ర, మునీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మకు పూజలు

గుడిబండ, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఉమేష్



ఉమేష్‌ను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

గుడిబండ, మే 20(ఆంధ్రజ్యోతి): గుడిబండ బీజేపీ పార్టీ మండల అధ్యక్షునిగా పలారం ఉమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం హనుమాన్ థియేటర్ ఆవరణంలో ఎన్నికల ఇన్‌చార్జి మేడకుర్తి హరి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉమేష్ సత్యసాయిజిల్లా అధ్యక్షులు శేఖర్ ప్రధాన కార్యదర్శి అమర్, సుధాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సమర్థవంతంగా సర్వే నిర్వహించాలి: ఎంఈఓ

గోరంట్ల, మే 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సర్వేని సమర్థవంతంగ నిర్వహించాలని ఎంఈఓ గోపాల్ సూచించారు. పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో సర్వేని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ తల్లిదండ్రులను కోరారు. సర్వేలో సమ్మిళ విద్యాబోధన ఉపాధ్యాయురాలు ఉమాదేవి, సిఆర్‌ఎంటి హరూన్‌బాషా, పిటిఐ అరుణకుమారి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

హిందూపురం, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండులో మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై వీధినాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులపట్ల వివక్ష చూపరాదన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

పెనుకొండ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిమడుగు గ్రామ శివారులో టీడీపీ కార్యకర్త బోయ ఆంజనేయులుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మునిమడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బోయ ఆంజనేయులు మంగళవారం ఉదయం కొత్తచెరువులకు మామిడికాయలు విక్రయంచి తిరిగి వస్తున్నారు. మునిమడుగు గ్రామశివారులోకి రాగానే గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా ద్విచక్రవాహనం అడ్డుపెట్టి ఆపారు. అది పరిశీలించేలోపే చెట్లపొదల్లోంచి నలుగురు రాళ్లతో మూకుమ్మడిగా దాడిచేసి ఉండాయించారన్నారు. కియా నుంచి కొత్తచెరువుకు వెళ్లే కార్మికులు గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులను హుటాహుటిన అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై కియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

- రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్

అగళి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ జీఎం విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఇందుకు సంబంధించిన మ్యాప్, స్కెచ్‌లను పరిశీలించారు. మండలంలో 2వేల ఎకరాల్లో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన భూములను గుర్తించడం జరుగుతుందన్నారు. రైతుల ఇష్టంతోనే సోలార్‌పవర్‌ప్లాంట్‌కు అవసరమైన భూములను సేకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారావు, ఆర్‌ఐ చంద్రశేఖర్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఘనంగా నాగరాజు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న రావిళ్ల లక్ష్మి, నాగరాజు

హిందూపురం, మే 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు నాగరాజు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. నాగరాజు ఇంటివద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అనధికారులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రావిళ్లలక్ష్మి, నాగరాజులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న నాయకుడు నాగరాజు అని అన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని భగవంతున్ని కోరారు. ఈ సందర్భంగా నాగరాజు కుటుంబ సభ్యులు ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేయించారు. ఇంటివద్ద 57కేజీల భారీ కేక్‌ను కట్‌చేశారు. జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలుపగా హిందూపురం నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని నాయకులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటివద్ద పండగవాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, బాలాజీ, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, బాబురెడ్డి, ఖలీల్, సితారా శ్రీనివాసులు, రఫీక్, లింగారెడ్డి, చలపతి, వినిత్, జియావుల్లా, ఆనంద్, కొండూరు శ్రీరాములు, ఈశ్వర్, సిద్దలింగప్ప, కొట్నూరుకు చెందిన అశ్వర్థ, రంగప్ప ఆదినారాయణరెడ్డి, కంచిసముద్రం చంద్ర, తిప్పారెడ్డి, నాగేంద్ర, ప్రవీణ్, భార్గవ్, వెంకటేశ్‌రెడ్డి, మంజునాథ్, ఉమాశంకర్, అన్వర్ పాల్గొన్నారు.



నాగరాజుకు కేక్ తినిపిస్తున్న కుమార్తె

కార్మిక సంఘాల నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గోరంట్ల, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ, కార్మిక, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగవారం సమస్యల సాధనకోసం నిరసన చేపట్టారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా పనిచేస్తున్నాయని విమర్శించారు. రైతులకు మద్దతు ధర, ఉపాధి పనిదినాల పెంపు తదితర డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మారుతికి అందించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కొండా వెంకటేష్, స్వర్ణలత, వెంకటరమణ, అంజలి, ఆంజనేయులు, అచ్చమ్మ, శోభ, రాము పాల్గొన్నారు.

కేబుల్ వైర్ దొంగల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు, కేబుల్‌వైర్

పావగడ, మే 20(ఆంధ్రజ్యోతి): వల్లూరు గ్రామ సరిహద్దులో ఉన్న అవధా సోలార్‌ప్లాంట్‌లో ఫ్యాన్లకు అమర్చే 2500మీటర్ల కేబుల్ వైర్‌ను దొంగలించిన ముగ్గురిని తిరుమణి పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ గిరీష్ తెలిపారు. జనవరిలో అవధ కంపెనీలో రూ. 2 లక్షలు విలువచేసే కేబుల్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు కంపెనీ యజమాని బసవరాజు పూజారి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ వివరించారు. దర్యాప్తులో భాగంగా ఎరికల మల్లేష్, బాబురావు, మంజులను విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారన్నారు. గతంలో వల్లూరు, క్యాతగానచెరువు, తిరుమణి, చిక్కహళ్లి, నేరలకుంటే తదితర గ్రామాల్లోని వివిధ కంపెనీల్లో వీరు పనిచేస్తూ అక్కడే ఉన్న విలువైన వస్తువులు దొంగలించినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. చోరీకి వినియోగించిన రెండు ద్విచక్రవాహనాలను, రూ.2లక్షలు విలువచేసే కేబుల్ వైర్‌ను స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసును చేదించిన ఏఎస్‌ఐ గోవిందరాజు, ఎస్‌ఐ లక్ష్మణ్, మల్లప్ప, నాయకోడ్, శ్రీకాంత్ నాయక్, సోమశేఖరలను తుమకూరు ఎస్పీ అశోక్ ప్రశంసించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి

- ఎంపీపీ వెంకటరత్నమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ

లేపాక్షి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వెంకటరత్నమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మూడునెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహులు, అన్నిశాఖల అధికారులను అభివృద్ధి పథకాలపై ఆరాతీశారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఒక్కోసారి గ్రామాల్లో తాగునీరు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకుని తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు మినీ మహానాడు

పెనుకొండ టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): మంత్రి సవిత ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నేడు మినీ మహానాడు నిర్వహిస్తున్న కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చే నాయకులు, కార్యకర్తల సౌకర్యాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా హాజరుకావాలన్నారు. ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు మినీ మహానాడు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

పరిగి: పెనుకొండ పట్టణంలోని మంత్రి సవిత క్యాంప్ కార్యాలయంలో జరగనున్న మినీ మహానాడును విజయవంతం చేయాలని మండల కన్వీనర్ గోవిందరెడ్డి కోరారు.

23 నుంచి రథయాత్ర

పావగడ, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణ కోరుతూ ఈనెల 23న పావగడ నుంచి రథయాత్ర ప్రారంభిస్తున్నట్లు సారథి భాస్కర్‌ప్రసాద్ తెలియజేశారు. ఇప్పటికే కులగణన ప్రక్రియ జరుగుతున్నప్పటికీ మరింత వేగవంతం చేయాలని కోరుతూ రథయాత్ర చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఉదయం పావగడ నుంచి రథయాత్ర ప్రారంభమై మిడిగేసి, హొసకెరె, ఐడీహళ్లి, కొడిగెనహళ్లి, పురవర, రాత్రి 8 గంటలకు మధుగిరికి చేరుకుంటుందన్నారు.

రొద్దంలో తిరంగా యాత్ర



రొద్దంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): రొద్దంలో మంగళవారం తిరంగయాత్ర నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి పురవీధులగుండా ర్యాలీ నిర్వహించారు. జవాన్ మురళినాయక్ ఆత్మశాంతి చేకూరాలని కోరారు. జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకెళ్లారు.

నేడు రొళ్లలో...

రొళ్ల, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10గంటలకు తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు బీజేపీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముద్దరాజు, డాక్టర్ నాగేంద్ర, పట్టాభిరాం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. రొళ్ల తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు సమీపంలోని శనిమహాత్మ దేవస్థానం కూడలి వరకు ర్యాలీ ఉంటుందన్నారు.

మొక్కు తీర్చుకున్న మహిళలు

అమరాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో టీడీపీ నాయకులు, మహిళలు ఉడసలమ్మకు మంగళవారం మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎన్నికల్లో ఎంఎస్ రాజు గెలవాలని ఆకాంక్షించారు. ఆయన గెలుపుతో కర్ణాటక రాష్ట్రం శిర పట్టణానికి ఆనుకుని ఉన్న ఉడసలమ్మ దేవాలయాలకి వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. హేమావతి పంచాయతీ కన్వీనర్ తిప్పజ్జ నరసింహనాయక, ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, గొల్లమనపల్లి రామచంద్రప్ప, మాజీ సర్పంచ్ కుమారస్వామి, పంచాయతీ ఉపాధ్యక్షుడు రంగస్వామి, యూనిట్ ఇన్చార్జ్ కృష్ణప్ప, క్లస్టర్ ఇంచార్జ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.